సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 20 । జనవరి । 2023



జగన్ సీఎంగా ఉంటేనే వ్యవస్థల మనుగడ

జగన్ ముఖ్యమంత్రిగా మళ్లీ కొనసాగితేనే రాష్ట్రంలోని వ్యవస్థలు మనుగడలో ఉంటాయని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అన్నారు. - 8లో



కానిస్టేబుల్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

ఈనెల 22న ఆదివారం నిర్వహించనున్న పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.1/14.8

జిల్లాలో గురువారం 14.8 – 31.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్



ఉభయ దేవేరులతో దేవునికడప శ్రీ లక్ష్మివెంకటేశ్వరస్వామి



దేవుని కడప ఆలయ ప్రాంగణం

అపర వైకుంఠం

- శ్రీనివాసుని ప్రతిరూపం కడప రాయుడి ఆలయం
- అడుగు పెట్టగానే ఆధ్యాత్మిక చింతన
- జిల్లా ఆధ్యాత్మిక క్షేత్రాల్లో తొలి స్థానం
- తిరుమలకు వెళ్లే ముందు ఇక్కడే మొక్కుబడి
- మత సామరస్యానికి ప్రతీకగా దేవదేవుని ఆలయం

కడప కల్చరల్ : ఆ ప్రాంగణంలో అడుగు పెట్టగానే ఏదో తెలియని తన్మయత్వం. అపర వైకుంఠమైన తిరుమలేశుని తొలి గడపగా భావిస్తున్న కడప రాయుడిని ఆ ప్రాంగణంలో దర్శించుకున్న మరుక్షణం బాధలన్నీ తొలగిపోయిన భావన. మనసు తేలికపడిన ఆనందం. కొత్తశక్తి లభించినట్లు అనిపిస్తుంది. అందుకే ఈ ఆలయం రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలలో ఒకటిగా, పర్యాటక ప్రాంతాలలో మొదటి వరుసలో ఉంది. కడప నగరంలోని దేవునికడపలోగల శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ఈనెల 21న శనివారం అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి.

- రాష్ట్రంలో వైఎస్సార్ జిల్లాలోని దేవుని కడప శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఎంతో విశిష్టమైన స్థానముంది. ప్రముఖ పర్యాటక క్షేత్రాల్లో ముందు వరుసలో నిలిచే ఈ ప్రాంతానికి చారిత్రకంగా కూడా ప్రాధాన్యత ఉంది.

తిరుమలకు వెళ్లే ముందు..

దేవదేవుడు శ్రీనివాసుని ప్రతిరూపం కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరుడు. ఆ బ్రహ్మాండ నాయకుడి క్షేత్రం దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం వైకుంఠాన్ని తలపిస్తోంది. తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న ఈ పవిత్ర క్షేత్రంలో కొలువై ఉన్న కడప రాయుడిని పూజిస్తే సాక్షాత్తు తిరుమలేశుడిని పూజించినట్లేనని చెబుతారు. తిరుమలకు వెళ్లే ముందుగా ఈ ప్రాంతానికి చెందిన భక్తులు స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఉత్తర ప్రాంతం నుంచి తిరుమలకు వెళ్లే భక్తులు కడప నగరంలోని ఈ క్షేత్రంలో విశ్రమించి అనంతరం స్వామిని దర్శించుకుని తిరుమలేశుని సన్నిధికి బయలుదేరే వారని తెలుస్తోంది. నేటికీ తిరుమలకు వెళ్లలేని వారు కడప రాయుని సన్నిధిలోనే మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ఆలయంలో


గర్భాలయం ఎదురుగా రంగమండపం పూర్తి స్థాయి శిల్ప సంపదతో అలరారుతోంది. భక్తులు కొద్దిసేపైనా ఆ ప్రాంగణంలో కూర్చొని ప్రశాంతత పొందాలని ఆశిస్తుంటారు. ఆలయంలో ఉత్తరం వైపున ప్రహరీకి దగ్గరగా చెట్టు కింద నాగుల విగ్రహాలున్నాయి. ఆ పక్కనే స్వామికి సర్వసేనాని విశ్వక్సేనుని మందిరం, శ్రీ గణపతి మందిరం ఉంది. ఈ రెండు దక్షిణ ముఖంగా ఉన్నాయి. తర్వాత ఉత్తర ద్వారం దగ్గరగా శ్రీ ఆండాల్ తాయారు అమ్మవారి మందిరం పడమర ముఖంగా ఉంది. ఈ మందిరాల మండపాలు, గోడలు శిల్పమయమై కనువిందు చేస్తున్నాయి. స్వామి దర్శనానికి ముందు భక్తులు ఇక్కడ కూడా పూజలు చేస్తారు.

పాద మండపం



రాజగోపురం నుంచి ఆలయంలోకి అడుగు పెట్టగానే ఎదురుగా పాద మండపం కనిపిస్తుంది. ఇందులో శ్రీవారి పాదాలున్నాయి. ఈ పాదాలపై ప్రస్తుతం ఇత్తడి తొడుగు ఉంది. భక్తులు తొలుత పాదాలను దర్శించుకుని ప్రదక్షిణలు చేసి ఆ వెనుకే గల బలిపీఠం వద్ద కొబ్బరికాయలు సమర్పిస్తారు. ఆ వెనుక రంగమండపం ఎదుటగల జ్యోతి మందిరంలో దీపం వెలిగించి మొక్కుకుంటారు. ఆలయానికి దక్షిణ గోపురం వద్ద ప్రహరీకి ఆనుకుని పెద్ద హాలులో దాదాపు పది మంది ఆళ్వార్ల విగ్రహాలు ఉన్నాయి. ఇదే మందిరంలో అత్యంత పురాతనమైన శ్రీ చెన్నకేశవస్వామి మూర్తి ఉంది. స్వామిని దర్శించుకున్న అనంతరం భక్తులు చెన్నకేశవునితోపాటు ఆళ్వార్లకు పూజలు నిర్వహిస్తారు. ఉత్తరద్వారం వైపు జమ్మిచెట్టు ఉంది. భక్తులు దీనికి ప్రదక్షిణలు చేసి సంతానం కోసం మొక్కుకుంటారు.

బంగారు బల్లి



కంచి ఆలయానికి వెళ్లిన వారు అక్కడి బంగారు బల్లిని తాకి దోష నివారణ చేసుకునేందుకు ప్రయత్నిస్తారు. ఆ తర్వాత అలాంటి అవకాశం కడప రాయుని ఆలయంలో మాత్రమే ఉంది. ఇక్కడి అమ్మవారి ఆలయం ద్వారం వద్ద పైకప్పులో రెండు రాతి బల్లులు ఇత్తడి తొడుగుతో కనిపిస్తాయి. కంచికి వెళ్ల(లే)ని వారు, వెళ్లినా అక్కడి ఆలయంలో బల్లులను తాకని వారు కడప రాయుని ఆలయంలోగల బల్లులను తాకి తృప్తి పొందుతారు. అమ్మవారి దర్శనానంతరం భక్తులు తప్పక ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

మత సామరస్యం

కడప రాయుని ఆలయం మత సామరస్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. సంవత్సరం పొడవునా కడప నగరానికి చెందిన వారే కాకుండా సమీప గ్రామాలకు చెందిన పలువురు ముస్లిం భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారు. అమ్మవారిని తమ ఆడబిడ్డ బీబీ నాంచారిగా భావించి లాంఛనాలు సమర్పించుకుంటారు. ముఖ్యంగా ఉగాది నాడు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహిస్తారు.

రేపటి నుంచి కడప రాయుడి బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : తిరుమల తొలిగడపగా భావించే కడప రాయడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు జనవరి 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానాల జేఈఓ వీరబ్రహ్మయ్య తెలిపారు. గురువారం స్వామి సన్నిధిలో ఆయన బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు, ఇతర సామగ్రిని అర్చకులు, స్థానిక అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ప్రతిరోజు ఉదయం 9.00 నుంచి 10.00 గంటల వరకు వివిధ పూజలు, వాహన సేవ, 10.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు దీక్షా తిరుమంజనం, స్నపన తిరుమంజనం, సాయంత్రం 6.00 నుంచి రాత్రి 7.00 గంటల వరకు సాయంత్రపు ఉత్సవాలు, అదే సమయంలో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సంకీర్తనలు, రాత్రి 7.00 నుంచి 8.00 గంటల వరకు వివిధ వాహనాల ఉత్సవాలు, 7.00 నుంచి 9.00 గంటల వరకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు హరికథ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఉత్సవాల వివరాలిలా ఉన్నాయి.

తేది	ఉదయం సేవలు	రాత్రి వాహన సేవ
21.01.2023	దీక్షా తిరుమంజనం	సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం
22.01.2023	తిరుచ్చి, ధ్వజారోహణం	చంద్రప్రభ వాహనం
23.01.2023	సూర్యప్రభ వాహనం	పెద్దశేష వాహనం
24.01.2023	చిన్నశేష వాహనం	సింహవాహనం
25.01.2023	కల్పవృక్ష వాహనం	హనుమంత వాహనం
26.01.2023	ముత్యపుపందిరి వాహనం	గరుడ వాహనం
27.01.2023	కల్యాణోత్సవం	గజవాహనం
28.01.2023	రథోత్సవం	ధూళి ఉత్సవం
29.01.2023	సర్వభూపాల వాహనం	అశ్వ వాహనం
30.01.2023	వసంతోత్సవం, చక్రస్నానం	హంస వాహనం, ధ్వజావరోహణం
31.01.2023	--	పుష్పయాగం

పకడ్బందీ ఏర్పాట్లు

ఈ సందర్భంగా టీటీడీ జేఈఓ వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు కడపరాయుని బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, అందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వహణ విషయంగా అన్ని శాఖలతోనూ ప్రత్యేక సమీక్ష నిర్వహించామన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాహన సేవలు ఉంటాయని, ముఖ్యంగా 26వ తేదీ గరుడ వాహన సేవకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారన్నారు. 28న రథోత్సవం ఉంటుందని తెలిపారు. ఇందులో భాగంగా రథం ఫిట్‌నెస్ కూడా పరిశీలించామని, ఈ ఉత్సవాలకు భక్తులు ఎంత మంది వస్తారన్న అంచనాతో గట్టి చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్‌బాబు, సూపరింటెండెంట్ వెంకటేశ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, విజిలెన్స్, సెక్యూరిటీ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మయ్య, ఇతర అధికారులు, అర్చకులు

వేగం కన్నా ప్రాణం మిన్న



జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్లు, బ్యానర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం

డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్‌బాషా

కడప వైఎస్ఆర్ సర్కిల్: వేగం కన్నా ప్రాణం మిన్న అనేది నినాదం మాత్రమే కాదని అందరూ ఆచరించాలని డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్‌బాషా పేర్కొన్నారు. గురువారం నగరంలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 24 వరకు జరుగుతున్న జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పాత్ర కీలకం

కడప సిటీ : రోడ్డు ప్రమాదాలను నివారించడంలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమైనదని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలతోపాటు తల్లిదండ్రులు కూడా బాధ్యతగా ఉంటేనే రోడ్డుప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా కలెక్టర్‌తో పాటు జేసీ సాయికాంత్‌వర్మ, డీఎఫ్ఓ సందీప్‌రెడ్డిలతో కలిసి రవాణాశాఖ రూపొందించిన రోడ్డు భద్రత–ప్రమాదాల నివారణపై అవగాహన పెంచే పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ మీరా ప్రసాద్, ఆర్టీఓ సుశీల, ఎంవీఐ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహప్రవేశాలు జరగాలి

కడప సిటీ : జిల్లా రీ సర్వే పనులు జాతీయ రహదారులకు భూ సేకరణ వేగవంతంతోపాటు ఉగాది నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సన్నద్ధం కావాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులకు సూచించారు. గురువారం రాజధాని నుంచి రీ సర్వే, ఇంటి స్థలాలు, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ శాఖలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి, సంబంధిత కార్యదర్శులతో కలిసి అన్నిజిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు, జేసీ సాయికాంత్ వర్మ, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనాలు సంబంధిత జిల్లా అధికారులు హాజరయ్యారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జాతీయరహదారులు, ఏపీఐఐసీ కోసం భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. స్పందన అర్జీలపై సకాలంలో స్పందించాలన్నారు.

తరగని సంపద.. వేమన పద్యాలు

కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ: సామాన్యులకు సైతం అర్థమయ్యే భాషలో తెలుగును వర్ధించిన ప్రజాకవి యోగి వేమన అని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. తెలుగు సాహితీరంగానికి ఆయన అందించిన పద్యాలు గొప్ప సంపద అని కొనియాడారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో యోగి వేమన జయంతి వేడుకలను కలెక్టర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జేసీ సాయికాంత్‌వర్మతోపాటు డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల ప్రొఫెసర్ మూల మల్లికార్జునరెడ్డి హాజరయ్యారు. అంతకుముందు యోగి వేమన చిత్రపటానికి కలెక్టర్‌తోపాటు జేసీ తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, జిల్లా పర్యాటక అధికారి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

దార్శనికుడు, ప్రజాకవి యోగివేమన: జిల్లా ఎస్పీ

కడప అర్బన్: తెలుగు సాహితీ, సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన దార్శనికుడు, ప్రజాకవి, సంఘ సంస్కర్త యోగివేమన అని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ కొనియాడారు. గురువారం యోగివేమన జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ, యోగివేమన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్‌డూడీ, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ బి. రమణయ్య, ఆర్ఐలు వీరేష్, సోమశేఖర్ నాయక్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేమన గొప్ప సంఘ సంస్కర్త

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్



యోగి వేమనకు నివాళులు అర్పిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, మాసీమ బాబు తదితరులు

కడప కార్పొరేషన్: యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గురువారం వేమన జయంతి సందర్భంగా స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమ బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి పాల్గొన్నారు.

సమాజానికి దిశానిర్దేశం చేసిన విశ్వకవి

- వైవీయూ వీసీ ఆచార్య జింక రంగ జనార్దన్

వైవీయూ: వాస్తవిక ప్రపంచాన్ని కళ్ల ముందుంచి, సమాజానికి దిశా నిర్దేశం చేసిన సంఘ సంస్కర్త, విశ్వకవి వేమన అని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగ జనార్దన్ అన్నారు. గురువారం వైవీయూలో 'వేమన జయంతి ఉత్సవం' ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, మానవీయ శాస్త్రాల డీన్ ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డి, మైసూరులోని కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం పీఠాధిపతి ఆచార్య ఎం. రామనాథంనాయుడులు వేమన, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు విశ్వవిద్యాలయ పరిపాలన భవనం నుంచి అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బందితో చైతన్య ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ట్స్‌బ్లాక్‌లోని సెమినార్ హాల్‌లో తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య జి. పార్వతి అధ్యక్షతన జరిగిన సభలో వైస్ చాన్సలర్ మాట్లాడారు. విద్యార్థులు వేమన పద్యాలను చదవడం కాకుండా, దైనందిన జీవితానికి అన్వయించుకోవాలని సూచించారు. తెలుగుశాఖ ఆచార్యులు డాక్టర్ ఎస్. ఈశ్వరరెడ్డి, డాక్టర్ ఎం.ఎం. వినోదినిలు సభా సమన్వయం చేశారు.



వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ తదితరులు

ఫ్లాష్.. ఫ్లాష్

ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న టెంపో వాహనం
- ముగ్గురి దుర్మరణం



ఆగి ఉన్న లారీని ఢీకొన్న టెంపో వాహనం



మృతి చెందిన మహిళ



నుజ్జునుజ్జయిన టెంపో

చాపాడు : చాపాడులో శుక్రవారం తెల్లవారుజామున 1.30 గంటల ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని వెనక వైపు టెంపో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళలు దుర్మరణం చెందారు. ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన 15 మంది టెంపో వాహనంలో తిరుపతికి వెళ్లి.. తిరిగి ప్రొద్దుటూరుకు వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. అనూష(35), ఓబులమ్మ(50), రామలక్ష్మి(55) అక్కడికక్కడే మృతి చెందగా, 8 మంది గాయపడ్డారు. బాధితులను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరు చిన్న పిల్లలు ఉన్నారు.

రైతులకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- మూడున్నర ఏళ్లుగా పండుగలా వ్యవసాయం
- విత్తనం నుంచి విక్రయం వరకు ఆర్‌బీకేల ద్వారానే సేవలు
- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి
- విజయవంతమైన కిసాన్ మేళా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

కడప అగ్రికల్చర్: రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని.. గత మూడున్నర ఏళ్లుగా వ్యవసాయం పండుగలా సాగుతోందని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో కిసాన్‌మేళాను ఘనంగా నిర్వహించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(గుంటూరు) పరిశోధన సంచాలకులు డాక్టర్ ప్రశాంతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వ్యవసాయ సాగులో రైతులకు ఖర్చులు తగ్గించి అధిక దిగుబడులను సాధించే విధంగా కొత్త టెక్నాలజీని తేవాలన్నారు. చాలా దేశాల్లో ఆధునిక టెక్నాలజీతో తక్కువ ఖర్చుతో అధిక విస్తీర్ణంలో పంటలను సాగు చేస్తున్నారన్నారు. వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గడిచిన మూడున్నర ఏళ్లలో రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగలా చేస్తున్నారన్నారు. విత్తనం నుంచి విక్రయం వరకు, ఎరువుల నుంచి పురుగు మందుల వరకు అన్ని రకాల సేవలు నేడు ఆర్‌బీకేల ద్వారా జరుగుతున్నాయన్నారు. పంటలకు ముందే మద్దతు ధరను ప్రకటించి అడుగడుగునా రైతులను ఆదుకుంటోందన్నారు. ప్రభుత్వ ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తక్కువ ఖర్చులతో ఎక్కువ ఆదాయం పొందే విధంగా ఆర్‌బీకేల ద్వారా సేవలందిస్తున్నామన్నారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రగతి పరంగా 2019లో 31వ స్థానం నుంచి ఈ రోజు 11వ స్థానంలో నిలిచిందన్నారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ సుకుమార్, కమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లారెడ్డి, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, వైఎస్సార్ జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, కోడూరు జెడ్పీటీసీ రత్నమ్మ, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసఆచారి, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మురళీకృష్ణ, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వీరయ్య, ఆత్మ పీడీ విజయలక్ష్మి, ఉద్యానశాఖ ఏడీ సుభాషిని, వ్యవసాయశాఖ ఏడీలు నరసింహారెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు రూపొందించిన ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపైన ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే డ్రోన్ వినియోగంపై డెమోను నిర్వహించారు.

క్లుప్తంగా

కడప మీదుగా ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కడప మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నట్లు కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష తెలిపారు. కాచిగూడ–తిరుపతి (07797/98) మధ్య ఈనెల 20, 21 తేదీల్లో నడిచే ఈ రైలు ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల్, కర్నూలుసిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుందన్నారు. వీటిలో టూ టైర్, త్రీ టైర్, స్లీపర్ క్లాస్, జనరల్ బోగీలు ఉంటాయన్నారు. అలాగే వారానికి ఒకరోజు నడిచే తిరుపతి–జాల్నా (07413/14) రైలు ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 28 వరకు పొడిగించినట్లు చెప్పారు. జాల్నా నుంచి తిరుపతి ప్రతి ఆదివారం నడిచే రైలు మార్చి 5వ తేదీ వరకు పొడిగించారన్నారు. ఈ రైలు ప్రతి మంగళవారం తిరుపతిలో, ఆదివారం జాల్నాలో బయలుదేరుతుందన్నారు. ప్రయాణికులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు ఆయన వివరించారు.

ఆర్టీసీకి రికార్డుస్థాయిలో ఆదాయం

జోన్‌వ్యాప్తంగా రూ. 8.29 కోట్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయి ఆదాయాన్ని నమోదు చేసింది. ఈనెల 18వ తేదీన ఒకరోజులో కడపజోన్‌లోని కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, తిరుపతి, చిత్తూరు జోన్‌లో రూ. 8,29,00,000 ఆదాయం వచ్చిందని కడప జోన్ ఈడీ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. సాధారణంగా ప్రతి ఏడాది సంక్రాంతి సీజన్‌లో రికార్డు స్థాయి ఆదాయం నమోదవుతుందని, ఈ సంవత్సరం సాధించిన ఘనతకు ప్రత్యేకత ఉందన్నారు. ఎందుకంటే గత ఏడాది మాదిరి టిక్కెట్ల ధరలు 50 శాతం అదనంగా పెంచలేదన్నారు. ప్రయాణికులు విశేషంగా ఆదరించడంతో సాధారణ చార్జీలతోనే ప్రత్యేక సర్వీసులు నడిపామన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు అంకితభావంతో పనిచేయడంతోపాటు వారి కృషితో ఈ ఘనత సాధించామని ఆయన వివరించారు.

కానిస్టేబుల్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్


కడపలోని పాత కలెక్టరేట్‌లో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ / ప్రొద్దుటూరు క్రైం : ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ) ఈనెల 22న ఆదివారం నిర్వహించనున్న పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించి కడప నగరంలోని 'పెన్నార్'పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో పోలీస్ అధికారులు, రీజనల్ కో ఆర్డినేటర్, సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్‌లతో గురువారం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నియమ నిబంధనలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు చర్యలను చేపడుతున్నామని చెప్పారు. అభ్యర్థులందరూ నియమ నిబంధనలు పాటిస్తూ సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. హాల్‌టికెట్, బాల్ పాయింట్ పెన్ మినహా ఇతర ఎలాంటి వస్తువులు అనుమతించబోమని ఎస్పీ వివరించారు.

ప్రొద్దుటూరులోని వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఏపీ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు రీజినల్ కో ఆర్డినేటర్ కె.వెంకటరమణయ్య ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ రమణయ్య, కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్లు ఆచార్య రఘునాథరెడ్డి, ఆచార్య రంగయ్యలు సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

■ కానిస్టేబుల్‌ల ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాల భద్రత విషయమై చేపట్టిన ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. పాత కలెక్టరేట్‌లో ఉన్న ట్రెజరీ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్ సందర్శించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్

జిల్లాలో ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై మొత్తం 426 కేసునమోదు చేశారు. ఇందులో భాగంగా ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన చోదకులపై 329 కేసులు సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, తదితర వాహనాల డ్రైవర్లపై 97 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

డీఆర్‌డీఏ పీడీగా ఆనంద్‌నాయక్ బాధ్యతలు


ఆనంద్‌నాయక్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా డాక్టర్ ఆనంద్‌నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా పనిచేస్తున్న పెద్దిరాజును బదిలీచేస్తూ ఆ స్థానంలో ఆనంద్‌నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆనంద్‌నాయక్ 1994లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా అదిలాబాద్‌లో పనిచేశారు. నెల్లూరులో ప్రాజెక్టు డైరెక్టర్‌గా, అనంతపురం, కర్నూలులలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పనిచేశారు. సీపీఓగా కర్నూలు, చిత్తూరు జిల్లాలలో సేవలు అందించారు. అనంతరం గుంటూరు డీఆర్‌డీఏ పీడీగా, విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ కడపకు బదిలీపై వచ్చారు. తొలుత ఆయన జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జేసీ సాయికాంత్‌వర్మ, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా, నూతన పీడీకి కార్యాలయ ఏపీడీ ప్రసాద్, హెచ్‌ఆర్ రఘునాథరెడ్డి, బ్యాంకు లింకేజీ అధికారి ధనుంజయ, స్త్రీనిధి ఏజీఎం రమణారెడ్డి, డీపీఎం హరప్రసాద్, డీపీఎం (ఫైనాన్స్)లావణ్య తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

500 బస్తాల చౌక బియ్యం పట్టివేత

ముద్దనూరు : విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడిలో పౌరసర ఫరాల చౌకదుకాణానికి చెందిన 500 బస్తాల బియ్యం బస్తాలు పట్టుబడ్డాయి.స్థానిక సీఐ మోహన్‌రెడ్డి సమాచారం మేరకు గురువారం జమ్మలమడుగు నుంచి పలమనేరుకు లారీలో బియ్యాన్ని తరలిస్తున్నారు. విజిలెన్స్‌అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రామకృష్ణ,డీటీ వరదకిషోర్ రెడ్డి సిబ్బందితో కలిసి స్థానిక 4 రోడ్ల కూడలి సమీపంలో లారీని తనిఖీ చేసి పట్టుకున్నారు. లారీని స్వాధీనం చేసుకున్నారు. జమ్మలమడుగుకు చెందిన గౌష్ బాషా,బాషాలను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. పట్టుబడిన 250 టన్నుల చౌక బియ్యం ధర సుమారు రూ.3లక్షల75వేలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జగన్ సీఎంగా ఉంటేనే వ్యవస్థల మనుగడ

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ కొనసాగితేనే రాష్ట్రంలోని వ్యవస్థలు మనుగడలో ఉంటాయని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. ప్రకృతి విపత్తులపై కమ్యూనిటీ వలంటీర్లకు గురువారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశ పెట్టడం ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి ఉన్నత సాంకేతిక విద్యలను అభ్యసించగలిగారని పేర్కొన్నారు. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నాలుగు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. సచివాలయ ఉద్యోగులను పర్మినెంట్ చేసిన విధంగానే కమ్యూనిటీ వలంటీర్లను కూడా పర్మినెంట్ చేసే అవకాశాలు లేకపోలేదన్నారు. అందుకే జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, మాస్టర్ ట్రైనర్లు, ఆపద మిత్రులు, ఆశా వర్కర్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌వైకే వలంటీర్లు పాల్గొన్నారు.

వరుసగా వాహనాలకు నిప్పు

భయాందోళనలో వేంపల్లె వాసులు


కాలిపోయిన బైకులు

వేంపల్లె : కడప జిల్లా వేంపల్లెలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు వరుసగా వాహనాలకు నిప్పు పెడుతున్నారు. దీంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. మూడు రోజులుగా తెల్లవారుజామున ఒకే సమయంలో వాహనాలు కాలిపోతున్నాయి. మొన్న గాంధీ రోడ్డులోని రాముల గుడి వద్ద సరస్వతికి చెందిన స్కూటీని పెట్రోలు పోసి కాల్చి వేయగా.. నిన్న అదే వీధిలోని హుస్సేనీకి చెందిన కారుకు నిప్పు పెట్టారు. గురువారం తెల్లవారుజామున వేంపల్లెలోని మేదర వీధిలో వెంకట నరేష్, సుధకు చెందిన బైకులపై పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. అలాగే రాముల గుడి వద్ద సుశాంత్‌కు చెందిన మరో స్కూటీకి నిప్పు పెట్టారు. మేధర వీధికి చెందిన సుధ సంక్రాంతి పండుగకు కడప నుంచి వేంపల్లెలోని తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. సెలవులు పూర్తి కావడంతో కడపకు వెళ్లాలనుకున్న సమయంలో బైకుకు నిప్పు పెట్టడంతో కాలిపోయిందని బాధితురాలు వాపోయింది. శబ్దం రావడంతో బయటకు వచ్చి చూడగా రెండు బైకులు ఒక చోట వేసి నిప్పు పెట్టారని వెంకట నరేష్ ఆవేదన చెందుతున్నాడు. కొద్దిగా ఆలస్యమై ఉంటే ఇంటికి కూడా నిప్పు అంటుకునేదని బాధితులు చెబుతున్నారు. పోలీసులు గస్తీ తిరుగుతున్నా మరో వైపు మోటార్ బైకులు మాత్రం కాలిపోతూనే ఉన్నాయి.

యూసీఐఎల్‌లో ఏడుగురికి ఉద్యోగాలు

ఎంపీ చొరవతో భూనిర్వాసితులకు న్యాయం


మాట్లాడుతున్న మరకా శివకృష్ణారెడ్డి

పులివెందుల రూరల్ : కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కృషి ఫలించింది. భూనిర్వాసితులకు న్యాయం జరిగింది.ఈ క్రమంలో వేముల మండలం కె.కె.కొట్టాల గ్రామానికి చెందిన ఏడుగురికి యురేనియం ప్రాజెక్టులో ఉద్యోగావకాశాలు లభించాయి. ఈ విషయంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి గురువారం స్థానిక వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఉద్యోగాలు పొందిన ఏడుగురితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యురేనియం ప్రాజెక్టు పరిధిలోని కె.కె.కొట్టాల సమీపంలో ఏర్పాటు చేసిన టెయిలింగ్ పాండ్‌కు సంబంధించి కొందరు రైతులు భూములు కోల్పోయారన్నారు.వీరికి ఉద్యోగావకాశాలు కల్పించాల్సిన బాధ్యత యూసీఐఎల్ అధికారులపై ఉందన్నారు. ఉద్యోగాల కోసం యూసీఐఎల్ అధికారుల చుట్టూ రెండు దశాబ్దాలకు పైబడి తిరిగినా ఫలితం లభించలేదన్నారు. ఈ విషయాన్ని యురేనియం ప్రాంత పరిధిలోని ఏడు గ్రామాల ప్రజలు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. స్పందించిన ఎంపీ విషయాన్ని కలెక్టర్, యూసీఐఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారన్నారు.12ఏళ్ల నాటి భూనిర్వాసితుల సమస్యకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషి ఫలించడంపట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ రంగనాథం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బెడుదూరు రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాలి


బెడుదూరు రిజర్వాయర్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కొండాపురం : కొండాపురం మండలంలోని పదివేల ఎకరాల ఆయకట్టు అభివృద్ధి కోసం బెడుదూరు రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బెడుదూరు రిజర్వాయర్ ప్రతిపాదిత ప్రాంతాన్ని సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ గండికోట రిజర్వాయర్ నిర్మాణానికి కొండాపురం మండలంలోని వేల ఎకరాల భూములు, ఇళ్లు కోల్పోతున్నప్పటికి గండికోట ప్రాజెక్టు కింద ఒక్క ఎకరా ఆయకట్టు లేదని ప్రజలు మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బెడుదూరు వద్ద రిజర్వాయర్ నిర్మించి ఎత్తిపోతల పథకం ద్వారా నింపి తద్వారా మండలంలోని పదివేల ఎకరాల ఆయకట్టు కునీరు అందించే చర్యలు చేపడతారని హామీ ఇచ్చారన్నారు. నాటి నుంచి నేటి వరకు హామి అమలుకు నోచులేదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యాన్ని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, రైతుకార్యదర్శి యంవి సుబ్బారెడ్డి, మండల కార్యదర్శి మనోహర్‌బాబు, సుదర్శన్‌రెడ్డి, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

కలసపాడు : రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం మండలంలోని ముదిరెడ్డిపల్లె వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు పోరుమామిళ్ల మండలం నాగలకుంట్ల గ్రామానికి చెందిన బొజ్జానడిపికొండయ్య (48) తన స్వగ్రామం నుంచి పని నిమిత్తం లింగారెడ్డిపల్లెకు ట్రాక్టర్‌లో బయలుదేరారు. ముదిరెడ్డిపల్లె, లింగారెడ్డిపల్లె గ్రామాల మధ్య ఉన్న మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పడంతో ట్రాక్టర్‌పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకు భార్య శ్యామలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

పాము కాటుకు రైతు..


రవిశంకర్‌రెడ్డి (ఫైల్)

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన ముక్కమల్ల రవిశంకర్‌రెడ్డి (49) అనే రైతు గురువారం పాము కాటుతో మృతి చెందాడు. గ్రామ సమీపంలోని కుందూనది దగ్గరలో పశువులను మేపుతుండగా పాముకాటుకు గురయ్యాడు. వెంటనే అతన్ని అంబులెన్స్‌లో ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రవిశంకర్‌రెడ్డి మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. రవిశంకర్ రెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతునికి భార్య అరుణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజగోపాల్ తెలిపారు. ఆయన మృతికి మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, గోపాయపల్లె సర్పంచ్ జీరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, రాజశేఖరరెడి సంతాపం తెలిపారు.

జేఎన్‌టీయూ బీటెక్ ఫలితాలు విడుదల

పులివెందుల రూరల్ : పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం రెండవ సెమిస్టర్ సప్లిమెంటరీ, బీటెక్ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ, బీటెక్ తృతీయ సంవత్సరం రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ, ఎంటెక్ ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ జీఎస్ఎస్ రాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంటెక్ రెగ్యులర్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. తక్కువ సమయంలో ఫలితాలు విడుదల చేసినందుకు పరీక్షా కేంద్ర విభాగాధిపతులను ఆయన అభినందించారు. పరీక్షా ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ రాజు, వైస్ ప్రిన్సిపల్ రమణారెడ్డి, పరీక్షా కేంద్ర విభాగాల అధిపతులు రంగరాజన్, ఎస్.రాధాకృష్ణ, వివిధ డిపార్ట్‌మెంట్ల విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ


బి.కోడూరు సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా

బి.కోడూరు : బి.కోడూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాడు–నేడు పనులను పరిశీలించారు. మండలంలో జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో రిపోర్టులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారి డాక్టర్ ఎస్.వినీత్‌కుమార్‌రాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ.ఉదయ్‌కిరణ్, ఆరోగ్య విస్తరణాధికారి టి.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా గురువారం సందర్శించారు. ఆసుపత్రిలో మందులను పరిశీలించారు.డాక్టర్ మేరీథెరీసాను అడిగి వివరాలు తెలుసుకున్నారు.జాతీయ ఆరోగ్య పథకాల అమలు తీరును గమనించారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి సాధు వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ: వ్యక్తి మృతి

కాశినాయన : మండలంలోని బసనపల్లె గ్రామ సమీపంలో గురువారం రాత్రి రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో తల్లపురెడ్డిబాలిరెడ్డి (50) అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు బాలిరెడ్డి పోరుమామిళ్లలో కోత మిషన్‌లో పనిచేస్తుంటాడు. సాయంత్రం పని ముగించుకుని బైక్‌లో ఇంటికి వస్తున్నాడు. కె.ఎస్.కొట్టాల గ్రామానికి చెందిన గురయ్య అనే యువకుడు పోరుమామిళ్లకు వెళుతున్నాడు. బసనపల్లె గ్రామ సమీపంలో రెండు బైకులు ఢీకొనడంతో బాలిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. గురయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని 108 వాహనంలో పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ప్రాథమిక చికిత్స అనంతరం కడపకు తీసుకెళ్లారు. మృతుడు బాలిరెడ్డికి భార్య నారాయణమ్మ, కుమారుడు భార్గవరామిరెడ్డి, కుమార్తె భార్గవి ఉన్నారు.

జిల్లా ఆస్పత్రి పరిశీలన


వైద్యులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కేంద్ర బృందం అధికారులు జిల్లా ఆస్పత్రిని పరిశీలించారు. ఎన్‌క్యాస్ లక్ష్యా కార్యక్రమంలో భాగంగా హర్యానాకు చెందిన డాక్టర్ పంకజ్ వట్స్ ఆధ్వర్యంలో ఆస్పత్రిని పరిశీలించారు. 18 విభాగాలకు చెందిన వైద్య సిబ్బంది, అధికారులతో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. ఆయా విభాగాల్లో అందిస్తున్న వైద్య సేవల నాణ్యత గురించి తెలుసుకున్నారు. ఎస్ఎన్‌సీయూ, ప్రసూతి, ఎమ్మార్ఐ, సీటీ స్కాన్ విభాగాలను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. మంగళవారం నుంచి గురువారం వరకు ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించామని డాక్టర్ పంకజ్ వట్స్ తెలిపారు. పరిశీలనలో వెల్లడైన అంశాల ఆధారంగా పూర్తి స్థాయి నివేదికను నేషనల్ రీసోర్స్ కమిటీకి పంపిస్తామన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్లు జార్ఖండ్‌కు చెందిన సిన్నిరవి, తమిళనాడుకు చెందిన విమల ఉన్నారు. ఆస్పత్రి ఆర్ఎంఓ రూపానంద్, ఏఓ ఈశ్వరసురేంద్ర, నర్సింగ్ సూపరింటెండెంట్లు రాణెమ్మ, సుజాతలు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారి

గంటలోపే తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


చిన్నారి రజినాను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ సత్యబాబు

కమలాపురం : కమలాపురం పట్టణంలో గురువారం తప్పిపోయిన మూడేళ్ల చిన్నారిని గంటలోపే పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వైఎస్సార్ జిల్లా కమలాపురం సీఐ సత్యబాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన రమేష్, గౌసియా దంపతులు కమలాపురంలోని పెద్ద దర్గాలో జరుగుతున్న బంధువుల పిల్లల పుట్టు వెంట్రుకలకు వచ్చారు. ఈ నేపథ్యంలో రమేష్ మూడేళ్ల కుమార్తె రజిన కొనుక్కోవడానికి దర్గా నుంచి రోడ్డు పైకి వచ్చింది. దారి మరిచిపోయి ఏపీజీబీ వద్ద దాదాపు అరగంట పాటు ఏడుస్తూ ఉండగా రామ్ నగర్‌కు చెందిన చైతన్య ప్రకాష్ ఎత్తుకొని పలు కాలనీలు తిరిగాడు. అయితే ఎవరూ గుర్తించక పోవడంతోఅతను మీడియాను సంప్రదించాడు. మీడియా వారు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు రజిన తప్పిపోయిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వైరల్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న చిన్నారి తల్లిందండ్రులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ సత్యబాబు వారిని విచారించి చిన్నారిని అప్పగించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, మరో సారి ఇలా జరగకుండా చూసుకోవాలని సూచించారు. రజిన తల్లిదండ్రులు పోలీసులు, మీడియాకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రక్తపరీక్షలపై అవగాహన

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో అనేక విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక వైద్యశాలలకు 63 రకాల రక్తపరీక్షలు చేసేందుకు అత్యాధునిక వైద్య పరికరాలను సరఫరా చేశామని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం అక్కాయపల్లెలోని పీహెచ్‌సీ కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్లకు రక్తపరీక్షలపై అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్క పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయాలని పేదలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు.డీపీఎంఓ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉబేదుల్లా, ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ నాగభూషణం, ట్రాన్స్ ఏసీఓ బయో మెడికల్ సీనియర్ మేనేజర్ రవికుమార్, సర్వీసు ఇంజనీరు యాసిన్, అప్లికేషన్‌మేనేజర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం కొనసాగింది.